క్లుప్తంగా

భోగి గణపతికి ధాన్యాభిషేకం



ప్రత్యేక అలంకరణలో భోగి గణపతి

బోట్‌క్లబ్: స్వయంభూ కాకినాడ భోగి గణపతి పీఠం 18వ వార్షిక బ్రహ్మోత్సవ ఆరాధన సోమవారం వైభవంగా నిర్వహించారు. తొలుత గోగు పిడకలు పేర్చి ఆవు నెయ్యితో భోగి మంట వెలిగించి గోక్షీరాన్ని పొంగించారు. బాలలకు భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు. అనంతరం స్వామి వారికి ధ్యానపురాశితో మహాధాన్యాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ ఆరాధకుల సందర్శనం కోసం వినాయక చవితి నుంచి 24 గంటల పీఠం గర్భాలయ ద్వారాలు తెరిచి ఉంచుతామన్నారు. పీఠం ఆధ్వర్యంలో మాఘ మాసం నుంచి ఆరాధకుల ఇంటిలో ప్రతి నెల రెండో ఆదివారం త్రినాథ వ్రత పూజ నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం భోగిగణపతి చరిత్ర కరపత్రాలను ఆవిష్కరించారు.

శిల్పారామంలో సంక్రాంతి వేడుకలు



శిల్పారామంలో సాంస్కృతిక నృత్య కార్యక్రమం

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్ రోడ్డులోని శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్టు శిల్పారామం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి సి.మోహన్‌తేజ తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం మహిళలు ముగ్గుల పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సీతారత్నలలిత కళా నృత్య నికేతన్, ముళ్ళపూడి విజయలక్ష్మి బృందంచే సాంస్కృతిక కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుటుంది. సంస్కృతి సంప్రదాయాల సమాహారం శిల్పారామమని మోహన్‌తేజ తెలిపారు.

కరపలో క్రికెట్ టోర్నీ



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రికెట్ అసోషియేషన్ ఆఫ్ కరప(సీఏకే) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్-2025 పోటీలు ఉల్లాసంగా, జోరుగా సాగుతున్నాయి. క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మూడోరోజు సోమవారం రెండు నాకౌట్, ఒక ఎలిమినేటర్, రెండు సెమీఫైనల్ పోటీలు జరిగాయి. నాకౌట్ పోటీలలో మొదటిమ్యాచ్‌లో కేఆర్పీ-11 జట్టుపై కొత్తపేట కరప జట్టు 9 పరుగుల తేడాతో గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో వాకాడ జట్టుపై జెడ్.భావారం జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కొత్తపేట కరప జట్టుపై పల్లపువీధి జట్టు 3 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది. నాకౌట్ మొదటి సెమీ ఫైనల్‌లో హోరాహోరీగా జరిగిన పోటీలో పల్లపువీధిజట్టుపై జెడ్.భావారం జట్టు 47 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రెండో సెమీఫైనల్‌లో ఫ్రెండ్స్-11 కరప జట్టు చేతిలో మారీబాయ్స్ వేళంగి జట్టు ఓటమిపాలైందని నిర్వాహకులు మేడిశెట్టి దుర్గాకిరణ్, నక్కా భీమ్, పోలిశెట్టి సునీల్ తెలిపారు. మంగళవారం నాకౌట్ ఫైనల్ పోటీ, సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ మెయిన్ పోటీలు జరుగుతాయని నిర్వాహకలు తెలిపారు.

కోడిపందేలపై దాడి

కరప: గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలు, గుండాట శిబిరాలపై కరప పోలీసులు దాడి చేసి 12 మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.6,210 నగదు స్వాధీనం చేసుకున్నారు. కరప ఎస్‌ఐ టి.సునీత తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలో కొరిపల్లి, గురజనాపల్లి, వేళంగి, గొర్రిపూడి గ్రామాల్లో చట్టవిరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం అందడంతో ఎస్‌ఐ సునీత సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆయా గ్రామాల్లో కోడిపందేలు, గుండాట నిర్వహిస్తున్న 12 మంది నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,210 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సునీత తెలిపారు.

ఘనంగా స్వామికి జన్మ నక్షత్ర పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్ర, పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారు జామున 4 గంటలకు స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అమ్మ వారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం స్వామి వారి అన్నప్రసాద వితరణ చేశారు.

పల్లెల్లో భోగి వెలుగులు



కరపలోని ఓ వీధిలో వేసిన భోగిమంట

కరప: పల్లెల్లో భోగి పండగను సంప్రదాయకంగా జరుపుకొన్నారు. యువకులు, పెద్దలు కలిసి తెల్లవారు జామునే లేచి ముందుగా సేకరించి దుంగలు, కలప, పిడకలతో భోగిమంటను వెలిగించారు. చిన్నారులు ఉదయాన్నే తలస్నానమాచరించి, కొత్త బట్టలు ధరించి భోగి పిడక దండలను మంటల్లో వేసి సందడి చేశారు. వృద్ధులు, యువకులు భోగిమంట వద్ద చలి కాచుకున్నారు. చిన్నారులు భోగిమంటకు నమస్కరించి విభూదిని పెట్టుకున్నారు. అందరికీ భోగి పండగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లోని తోటల్లో, మెరక ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన కోడి పందేలను తిలకించి యువకులు, పెద్దలు ఉత్సాహంగా గడిపారు. గృహాల్లో బంధువులు, కొత్త అల్లుళ్లతో కలిసి ఇంటిల్లిపాది పిండివంటలు ఆరగిస్తూ సరదా కబుర్లతో, ఆటపాటలతో కాలక్షేపం చేశారు. చిన్నారులకు భోగిపండ్లను వేసి ఆశీర్వదించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు తమ ఇంటి ముంగిట ఆకర్షణీయంగా రంగవల్లులు వేశారు.

జోరుగా సాగిన కోడిపందేలు

సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు, గుండాట జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామంటామని పోలీసులు విస్తృతంగా ప్రచారం చేసి, హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సంప్రదాయ ఆటలే ముద్దు, జూద క్రీడలు వద్దు అంటూ కరప ఎస్‌ఐ టి.సునీత సిబ్బందితో కలిసి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. యండమూరు, వేళంగి, విజయరాయుడుపాలెం, కొంగోడు, గొర్రిపూడి, గురజనాపల్లి, కొరిపల్లి గ్రామాల్లో కోడిపందేలు నిర్వహణకు బరులు ఏర్పాటు చేసి, సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మరో పక్క సంప్రదాయబద్ధంగా, చట్టానికిలోబడి సంక్రాంతి పండగ జరుపుకోవాలని పాలకులు, అధికారులు సూచనలు చేయడంతో పలు గ్రామాల్లో కోడిపందేలు, గుండాటలు జోరుగా సాగాయి. కొరిపల్లిలో మూడు రోజుల్లో అధిక పందేలు గెలుపొందిన వారికి చిన కారు, గురజనాపల్లిలో మూడు బుల్లెట్ మోటారుసైకిళ్లు, గొర్రిపూడిలో మోటారుసైకిల్ బహుమతులుగా ఇస్తామని పందెంరాయుళ్లను ఆకర్షించారు. ఆయా గ్రామాల్లో కోడిపందేల నిర్వాహకులకు ఒక్కో బరికి రూ.25 లక్షలు నుంచి రూ.40 లక్షలు ఇచ్చేందుకు గుండాట యజయానులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. యువకులు, పెద్దలు, పిల్లలు కోడి పందాల్లో పాల్గొని భోగిపండగను ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకొన్నారు.



నడకుదురు సమీపంలోని ఒక లేఅవుట్‌లో నిర్వహిస్తున్న కోడి పందేలు



కోడిపందేలు తిలకించేందుకు ఏర్పాటు చేసిన గ్యాలరీ



కోడిపందేల బరి వద్ద పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేల ఫొటోలతో ఏర్పాటు చేసిన ఆహ్వాన ముఖ ద్వారం

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



సంక్రాంతి వాతావరణ ఉట్టిపడేలా పైడా కృష్ణమోహన్ ఇంటిలో ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు





చూపరులను ఆకట్టుకొంటున్న బొమ్మల కొలువు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): పూరి గుడిసెలు, హరిదాసు, ఎద్దులు, పందెం కోళ్లు, రైతులు, ధాన్యం ఇలా పల్లె వాతావరణ ఉట్టిపడేలా స్థానిక పైడావారివీధి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడా కృష్ణమోహన్ ఇంటిలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, పల్లెటూరి సెట్టింగ్‌లు అందరినీ అలరించాయి. అష్టలక్ష్మి విగ్రహాలతోపాటు, వరుడు, వధువు, వివిధ రకాలు దేవతామూర్తులు బొమ్మలు కొలువు అందరినీ ఆకట్టుకుంది. ఏటా సంక్రాంతికి సంప్రాదాయంగా వీటిని నేటి తరానికి తెలియజేయాలని ఏర్పాటు చేసినట్టు పైడా కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. బొమ్మల కొలువు తిలకించేందుకు పలువురు తరలివచ్చారు. ఈ సందర్భంగా డడూ బసవన్న సందడి చేశాయి.

బోట్‌క్లబ్: ప్రముఖ న్యాయవాది వక్కలంక సత్యనారాయణమూర్తి, వాణిశ్రీ దంపతులు సంక్రాంతి సందర్భంగా స్థానిక బోటక్లబ్ ఎదురుగా ఉన్న శ్రీనివాస్ నగర్‌లోని వారి గృహంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. గత 16 సంవత్సరాలు నుంచి క్రమం తప్పకుండా ఈ బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నట్టు వారు తెలిపారు. పండుగ మూడు రోజులు ఈ బొమ్మల కొలువు ఉంటుందని దీనిని చూసేందుకు బంధువులు, ఇరుపొరుగువారు చాలా మంది వస్తున్నారని సత్యనారాయణమూర్తి తెలిపారు.

నిరుద్యోగుల కలను నిజం చేస్తున్నారు



పురస్కారం అందుకొంటున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్

బోట్‌క్లబ్: ప్రతీ నిరుద్యోగి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కల కంటారని వారి కలలను శ్యామ్ నిజం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు అన్నారు. స్థానిక సూర్యకళామందిరంలో సోమవారం అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్‌ను అల్లూరి సీతారామరాజు విశిష్ట సేవా పురస్కారం అందించారు. వేలాది నిరుద్యోగులను ప్రభుత్వ కొలువు అందిస్తున్న వ్యక్తిని సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సన్మాత గ్రహీత శ్యామ్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా 18 వేల మంది తమ ఇనిస్టిట్యూట్‌లో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారన్నారు. పేద విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చడంలోనే తమకు అత్యంత సంతృప్తి ఇస్తుందన్నారు. దీని కోసం తాను నిరంతరం శ్రమిస్తూనే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజు కళావేదిక కార్యదర్శి పంపన దయానంద బాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కళావేదిక సభ్యులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం



భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కాకినాడ రూరల్ : సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ ప్రజల పాలిట భారంగా మారిన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ప్రభుత్వ విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై అధిక భారాన్ని వేయడాన్ని సీపీఎం పార్టీ ఖండిస్తుందని ఆ పార్టీ నాయకులు తెలియజేశారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోయి నెలవారీ ఆదాయాలు తగ్గిపోయిన పరిస్థితుల్లో అదనంగా విద్యుత్ చార్జీలు మోపడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ఒక పక్క ప్రజలను మోసగిస్తూ మరోపక్క అదనపు భారాలు మోపడం ప్రభుత్వం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. తక్షణం విద్యుత్ ట్రూ అప్ చార్జీలను తగ్గించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ప్రజా పోరాటం చేస్తుందని, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రజలు విద్యుత్ చార్జీలు వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణారావు, జుత్తుగ శ్రీనివాసరావు, లోవరాజు తదితరులు నాయకత్వహించారు.

కనుల వైకుంఠం.. గోదా కల్యాణం



దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



సర్పవరం ఆలయంలో గోదా కల్యాణం జరిపిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు భాగంగా సోమవారం నగరంలో పలు వైష్ణవ ఆలయాల్లో గోదాకల్యాణం కనుల వైకుంఠంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తకంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణం మహోత్సవం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక దేవాలయంవీధిలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గోదా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గోదా రంగనాథుని కల్యాణం రంగ రంగ వైభవంగా జరిగింది. పుణ్యాహవచనం, జీలకర్రబెల్లం, శుభముహూర్తం, తలంబ్రాలు ఘట్టాలు కనుల వైకుంఠంగా సాగాయి. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులో సీతారామ స్వామి ఆలయంలో కూడా గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు పట్టువస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. జగన్నాథపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలోను గోదా కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అధిక సంఖ్య భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ సత్యవాణి ఏర్పాట్లు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అష్టలక్ష్మి ఆలయంలోను గోదా కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక జగన్నాథపురంలోని విష్ణాలయంలో గోదారంగనాథుల కల్యాణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోను, వేంకట్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలోను, పళ్లంరాజునగర్‌లోని ఆలయంతో పలు ఆలయాల్లో జరిగిన గోదా కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సర్పవరంలో...

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భోగి పండగను పురస్కరించుకుని సోమవారం ఘనంగా గోదా కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కనులారా వీక్షించారు. ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

కరప మండలంలో..

కరప: స్థానిక విష్ణాలయంలో సోమవారం రాత్రి గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే వేణుగోపాలస్వామికి అభిషేకాలు, తులసీ దళాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, లక్ష్మీదేవి ప్రతిరూపమైన గోదాదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామిని పెండ్లికుమారుడిగా, గోదాదేవిని పెండ్లికుమార్తెగా అలంకరించి, ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ, సూర్యనారాయణ, వాడపల్లి దీక్షితులు వేద మంత్రోర్చనల మధ్య కల్యాణ క్రతువుని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గోదాదేవి కల్యాణ వేడుకలు తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి సీతారామం గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మార్రెళ్ల శివ, అధిక సంఖ్యలో భక్తులు గోదాదేవి కల్యాణ వేడుకలలో పాల్గొన్నారు. పెనుగుదురులోని విష్ణాలయంలో ధనుర్మాస సందర్భంగా గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు.



జగన్నాథపురం విష్ణాలయంలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు



కరప విష్ణాలయంలో నిర్వహిస్తున్న గోదా దేవి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న మహిళలు

వాకలపూడిలో ఆటల పోటీలు



వాకలపూడి సంక్రాంతి వేడుకల్లో నిర్వాహకులు, ముఖ్య అతిథులు, గ్రామస్తులు

కాకినాడ రూరల్: స్థానిక వాకలపూడి గ్రామ పంచాయతీలోని జీఎఫ్‌సీఎల్ కాలనీలో అధ్యక్షుడు ఎస్‌కే కరీం భాష, సెక్రటరీ పొన్నాడ విశ్వనాథం, అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ముఖ్య అతిథిగా టాస్క్‌ఫోర్స్ సీఐ టి.వెంకటలక్ష్మి, జడ్జిలుగా రాధా మాధవి, ఎం.శ్రీదేవి, ఎం.సురేఖప్రొఫెసర్స్ పాల్గొని ముందుగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన గొప్పతనాన్ని కాలనీ వాసులకు తెలియజేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు న్యాయనిర్ణేతలు, ముఖ్య అతిథులు కాలనీ అసోసియేషన్ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మణరావు, అప్పారావు, ఏడుకొండలు, నాని, శ్రీనివాస్, బలరాం, రాజు, అన్నవరం, సాయిరాం, పిల్లలు పెద్దలు, కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా లయన్స్ వ్యవస్థాపక దినోత్సవం



బాదం బాలకృష్ణను సత్కరించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: స్థానిక లయన్స్‌క్లబ్ హాలులో క్లబ్ అధ్యక్షుడు ఎంవీఆర్ మోహన్‌కుమార్ అధ్యక్షతన లయన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులైన లయన్ మెల్విన్ జోన్స్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ లయన్స్ ఫౌండేషన్ ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన వారికి ఇళ్లు కట్టించడం, కంటి ఆస్పత్రి నిర్మాణం, మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించడం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం లయన్స్ ఫౌండేషన్‌కు తమ కుటుంబం నుంచి రూ.13 లక్షల విరాళంగా ఇచ్చిన బాదం బాలకృష్ణను సభ్యులు ఘనంగా సత్కరించారు. అదే విధంగా రూ.1.70 లక్షల ఇచ్చిన పూర్వపు గవర్నర్ మంజులూరి విశ్వేశ్వరరావు, జి.ఎల్.జగన్నాథరావు, రూ.85వేలు ఇచ్చిన రీజియన్ చైర్‌పర్సన్ పద్మతులసి, మేడిశెట్టి వెంకటరమణ, పద్మాక్షి, కె.భామిరెడ్డి, కరుటూరి శ్రీనివాస్, రమాసుందరి, మట్టపల్లి సురేష్‌కుమార్, ఏఏఆర్ మోహన్‌రావు, చక్కా శ్రీనివాస్, పీవీ సుబ్బారావులను సత్కరించారు.

నేడు అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం ఏర్పాటు చేసినట్లు ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయంలో దీపోత్సవం ఉంటుందన్నారు. అనంతరం జ్యోతి దర్శనం ఉంటుందన్నారు.